పై మ ని షి

“నేను రావటానికి ఇంకా రెండేళ్ళవుతుంది. ఈ లోపల ఊరికే కూర్చుని యేంచేస్తావు. హిందీ నేర్చుకో. ఆ భాష వచ్చి ఉండటము ప్రతివాళ్ళకూ అవసరము. తీరిక సమయములో సంగీతసాధన కూడా చేసుకుంటూ ఉండు. మన దేశపు స్త్రీలలో చాలామంది సంసారములో అడుగు పెట్టగానే తమకు వచ్చిన విద్యకు అవివేకముగా స్వస్తి చెప్పుతారు. మరో రెండేళ్ళకు నిరుత్సాహమూ నీరసమూ ఒంట్లో ప్రవేశించటమూ, ప్రతి విషయములోనూ ‘మాకెందుకులే’ అన్న వేదాంతములోకి దిగటమూ జరుగుతుంది. తారుణ్యములో ఉన్న స్త్రీలు-అందులోనూ విద్య నేర్చినవాళ్ళు - ఎంత ఉత్సాహముగా-నవనవోన్మేషముగా ఉండాలి ? గిరిజా! ఈ దేశస్థులంతా ఎట్లా ఉంటారను కున్నావు ? ఇక్కడి అరవై ఏళ్ళస్త్రీ - మన దేశములోని ఇరవై ఏళ్ళస్త్రీ కంటె ఉత్సాహముతో జీవితము గడుపుతుందంటే నమ్ము. అందుకని నేను చెప్పినట్లుగా విను. నీకు ఇదివరలో వచ్చిన విద్యలను విస్మరించకుండా - శ్రద్ధతో పెంపొందించుకో. నీకు సంగీతములో ఉన్న ప్రావీణ్యానికి మెరుగులు దిద్దుకో. మన భారతీయ నాగరికత - సంస్కృతి ఎంత గొప్పవను కున్నావు! ఇక్కడికి వచ్చినప్పటినుండీ ఆ గొప్పతనము పదింతలుగా నాకు అనుక్షణమూ తోస్తున్నది. ‘తెల్లవాళ్ళ దేశములో ఉన్న మీ ఆయన మడికట్టుకొని కూర్చున్నాడను కొన్నావా ?’ అని మనవాళ్ళందరూ అనే మాటలను నమ్మి, నాకు జాబు వ్రాయకుండా ఊరుకునేవు! కనీసము వారానికి ఒక్కసారైనా జాబు వ్రాస్తూ ఉండు. మ॥ నాయనగారికి రెండు కళ్ళూ ఆపరేషను చేయవలసిన వచ్చినదా ? ల॥ అమ్మగారికి నా నమస్కారములు.”

ఈ ఉత్తరము చంద్రమౌళి అమెరికానుండి చెన్నరాజధానిలో ఉన్న గిరిజకు వ్రాశాడు. అప్పటికి అతడు అమెరికా వెళ్ళి ఎనిమిది నెలలు కావచ్చినవి. ఏకపుత్ర వియోగభారములో మునిగిపోయిన అత్తమామలకు ధైర్యము చెప్పుతూ వాళ్ళను కనిపెట్టుకొని ఉంటున్నది గిరిజ. వృద్ధులైన అత్తమామల దగ్గర ఆ కోడలు మేనకోడలివలె చనవుగా తిరుగుతూ ఉండేది.

చంద్రమౌళి వెళ్ళిన ఆరు నెలలకు అతని తండ్రి అయిన లక్ష్మయ్యగారికి రెండు కళ్లూ ఆపరేషను చేయవలసి వచ్చినది. ఆపరేషను చక్కగా జరిగినప్పటికీ చూపుమాత్రము యథాప్రకారముగా రాలేదు. అందువలన మామగారికి ఎప్పుడూ ఏదో ఒకటి చదివి వినిపిస్తూ వార్తలను తెలుపుతూ ఉండేది.

"మీరు వ్రాసినట్లుగా సంగీత సాధన చేసుకొంటూ - హిందీ నేర్చుకొంటూ ఉన్నాను. గాని నా ఆరోగ్యము వెనుకటివలె చురుకుగా లేదు. ఎప్పటివలె చాలా సేపు కూర్చుని ఏపనీ చేయలేకుండా ఉన్నాను. మ॥ మీ నాయనగారూ, ల॥ అమ్మ గారూ క్షేమముగా ఉన్నారు."

ఇది గిరిజ దగ్గరినుండి చంద్రమౌళికి వచ్చిన జాబులోని కొంత భాగము. ఈ జాబు వచ్చికూడా నెల పైగా అయినది. చంద్రమౌళి వ్రాసిన రెండు జాబు లకూ జవాబు రాలేదు. ఒక కేబుల్ కూడా యిచ్చాడు. అతడికి తనవాళ్ళ దగ్గర నుండి జాబు రాకపోవటమువల్ల చిరాకుగా ఉంటున్నది. పగలంతా కాలేజీలో ప్రొద్దు గడచిపోయేది. కాని యింటికి రాగానే తిరిగి అదేధ్యాస.........వృద్ధులైన తలిదండ్రులు లెట్లా ఉన్నారో............గిరిజ ఏమి చేస్తున్నదో ?"

ఆ దినము సాయంత్రము ఏమీ తోచక సినిమాకు వెళ్ళాడు. ఇంటికిరాగానే అతడికి మనసులోని బాధ కెలకవేసింది. గిరిజ దగ్గరనుండి ఎప్పుడు ఉత్తరము వచ్చినా కిటికీదగ్గర తాను వచ్చేవరకూ క్రిందబడి దుమ్ములో కొట్టుకొని పోవటము చూచి భరించిలేక - అతడీమధ్య కిటికీకి దగ్గరగా ఒక చిన్నబల్ల వేసి దానిమీద మెత్తటి దిండును ఉంచుతూ వచ్చాడు. గిరిజ స్వహస్తములతో లిఖించిన ఉత్త రము కిటికీలోనుండి మెత్తటి దిండుమీద పడుతుంది. మనిషి తరువాత అప్యాయ ముగా చూసుకోవలసినవి ఆ మనిషి వస్తువులూ, ఉత్తరాలూను. అందుకొరకు ఆతడు గిరిజ దగ్గరనుండి వచ్చిన ఉత్తరాన్ని కళ్ళకు అద్దుకొనిగాని విప్పిచూడడు ! అతడు లోపలికి వచ్చి దీపముపెట్టి కిటికీ మూలకు వెళ్ళి ఆ మెత్తటి దిండుపై తన దృష్టిని పోనిచ్చాడు. దానిపైన రెండుబల్లులు సన్నటి పురుగులను వేటాడు తున్నాయి. కాని జాబులేదు.

అతడు నిరాశతో ప్రక్కమీదికి వాలిపోయాడు. 'గిరిజకు జాబు వ్రాయ లేనంతటి అనారోగ్యమేదో కలిగి ఉండాలి....లేకపోతే....ఇన్నిదినాలు తనకు జాబు

వ్రాయకుండా ఉండగలదా? జాబు వ్రాయటానికి తన తండ్రికి పాపము దృష్టి మాంద్యమూ.........తల్లికి అక్షరజ్ఞానశూన్యతాను. ఆ యింటి సంగతులు తెలుప గలిగిన దొక్క గిరిజే.'' ఆవిధముగా అతడు ఆలోచింపుతూ ఉండగానే ఎప్పుడు వశపరచు కొన్నదో నిద్రాదేవి అతడి కళ్లు మూతపడ్డాయి.

మరునాటి ఉదయము కాలేజీకి వెళ్ళే సమయములో అతడికి తిరిగి ఇంటి విషయము జ్ఞాపకము వచ్చి ఆ దినముకూడా జాబు రానిపక్షములో తన స్నేహి తుల కెవరికైనా జాబువ్రాసి తనవారి క్షేమము తెలిసికోవాలనే నిర్ణయానికి వచ్చాడు. తన స్నేహితులలో సహృదయుడైన రామలింగము మదరాసులో ఉన్నాడు. వ్రాస్తే అతడికే వ్రాయాలి. అతడు తమ గ్రామమువెళ్ళి క్షేమము తెలిసికొని వ్రాయ గలడు. అది ఎంతలేదన్నా వారము దినముల పని.

ఆ మధ్యాహ్నము చంద్రమౌళి గది కిటికీకి దగ్గరగా తపాలామనిషి నడ చిన శబ్దము ప్రక్కయింటివారికి వినవచ్చింది. కొన్ని వేల మైళ్ళ దూరమునుంచి పయనము చేసి - అలసి సొలసి వచ్చిన నీలిరంగు కవరు కిటికీలోనుండి పడుతూ ఉండగానే మఖమల్ దిండు ఆ లేఖకు స్వాగతమిచ్చి - మెత్తటి శయ్యగా అమరి సేదతీర్చి - చంద్రమౌళి రాగానే కిలకిల నవ్వుతూ వేయిదీపాల వెలుగుతో అత డికి అందించింది.

అతడు పట్టరాని ఆనందముతో తబ్బిబ్బయినాడు ఎప్పటివలెనే కళ్ళకు అద్దుకొని కవరు చింపాడు.

"మ॥ మీ నాయనగారూ, ల॥ అమ్మగారూ క్షేమముగా ఉన్నారు. మిమ్మల్ని చూడవలెనని చాలా ఆతురతతో ఉన్నారు. ఇక్కడి విషయాలన్నీ యథాప్రకారము గానే ఉన్నాయి. అన్నట్లు వ్రాయ మరచాను; రెండు నెలల క్రిందట మీ నాయన గారి వైపు చుట్టము వచ్చాడు. ఒక నెలరోజులవరకూ బెట్టుబెట్టుగా ఉన్నాడు గాని తరువాత నుండి ఒకటే గొడవచేస్తున్నాడు ఇంట్లోచేరి. అందుకొరకే వెనుకటివలె సంగీతసాధనకూ దానికీ - తగినంత విరామము చిక్కటములేదు. వెంటవెంట మీకు జాబులను కూడా వ్రాయలేక పోతున్నాను. మీరే తరచు వ్రాస్తూ ఉండండి.'

చంద్రమౌళి ఉత్తరము చదువుకొని ఆ దిండుమీదనే విసరి పడవేశాడు.

14

'ఇంతకూ అమ్మగారికీ నాయనగారికేనా తనను చూడవలెనన్న ఆత్రము ? మరెవరికీ..........లేదన్న మాట !'

మనసు చివుక్కుమన్నది. అయినా దానికి తగినట్లుగానే ఆ మరునాడు గిరిజ ఉత్తరానికి అతడు జవాబు వ్రాశాడు. అంతే..........మరి రెండు నెలల వరకూ ఒక ఉత్తరమైనా అటునుండి యిటురాలేదు - ఒక్కటైనా ఇటునుండి అటుపోలేదు.

అతడి మనసు వేయి ఆలోచనలతో వికలమయి పోయింది. తరువాత అతడు ఏదో పరీక్షల తొందరలో ఉండగా- ఉన్నట్లుండి, గిరిజ దగ్గరనుండి ఒక జాబు వచ్చింది.

''మీదగ్గరనుండి ఉత్తరము రావటము లేదనీ మీ క్షేమము తెలియుటము లేదనీ మీ తల్లిదండ్రులు చాలా బెంగపెట్టుకొన్నారు. మీకేమయినా మస్తీ చేయలేదు కదా ! మన ఉప్పూ కారమూ తిని ఎన్నిరోజులయిందో ? మీకిష్టమైన వంటకాలు చేసిన రోజున మీ అమ్మగారికి మీ స్మరణే. నాలుగు రోజుల వరకూ అదేమాట మాట్లాడుతూ ఉంటారు ? పై మనిషి ఒక్కడే అయినా ఎంత చాకిరీ వాపోలపడిన దనుకున్నారు ? అస్తమానమూ ఒక మనిషికి సరిపోతుంది ఆ పని. అందువల్లనే నాకు రాత్రిళ్లు నిద్రకూడా కరవై పోయింది. భోజనము మీదినుంచి - నిద్రలో నుంచి - లేపినప్పుడు అపరిమితమైన కోపము వస్తుంది నాకు. అయినా ఆ మనిషి ముఖంలో ఏమున్నదో..........అంత కోపమూ కసీ ఒక్కసారి మాయమైపోతాయి. అదేమిటో మాయగానే ఉన్నది సుమా ! ఆ చేతులూ ఆ ముఖమూ ఎంతసేపు చూసినా చూడాలనే అనిపిస్తుంది.''

ఇది చదివిన తరువాత అతడికి ముచ్చెమటలు పోశాయి. ఇటువంటి ఉత్తరము రాకపోయినా బాగుండేది. ప్రపంచము నిన్న ఉన్నట్లుగా యీ దినముకూడా ఉండాలన్న సిద్ధాంతాన్ని ఏ చదువుకున్న బుద్ధిమంతుడూ అంగీకరించడు గాని.... కొన్ని విషయాలలోనైనా నిన్నటి పోలికలు ఉండాలా మరి ! నాయనగారివైపు చుట్టమట.......పై మనిషట..........తమయింటికి వచ్చి అన్ని నెలలపాటు తిష్ఠ వేసుకొని కూర్చుండగా తన తండ్రి ఎట్లా ఓర్చుకొని ఉండగలిగాడు ? ఏదో తమకు యింత సహాయముగా ఉండగలడని తండ్రి అనుమతించాడేమో. ఈ పై మనిషి చాకిరీవల్ల గిరిజకు రాత్రిళ్లు నిద్రకూడా కరవైపోవట మేమిటి ! ఎంత చుట్టమైనా

ఈమె తెల్లవార్లూ ఏమి ఉపచారము చేస్తున్నది ? ఇటువంటి కుటుంబ ద్రోహికేనా తండ్రి తెలుసుకోలేక ఆశ్రయమిచ్చింది ? ఇదిగాక అతడి క్రోధాన్ని ఇనుమడింప చేసిన మాట మరొకటి....... 'తన తల్లి తనకు యిష్టమైన వంటకాలను చేసిన నాలుగు రోజుల వరకూ కొడుకునే జ్ఞాపకము చేసుకొంటూ ఉన్నదట ! ఇది సహజ మైన మాటేగా ! ఒక్క తల్లికయినా తనమీద మమకారము ఇప్పటివరకూ నిలచి ఉండటము గొప్ప అదృష్టమనే చెప్పుకోవాలి !'

ఈ ఉత్తరము వచ్చిన దగ్గరనుంచీ అతడిని పరధ్యానము ఆవహించింది. భోజనము చేసినా ఆకలి తీరినట్లు లేదు - నిద్రపోయినా దేహము విశ్రాంతి నెరుగ నట్లే ఉన్నది. సినిమాలు చూసినప్పటికీ - నలుగురితో సంభాషించి నప్పటికీ అతడి మనసు వికాసము పొందలేదు. అది యేమి వ్యాధో గాని....అతడికి దేహములోని బలమూ - నరములలోని పటుత్వమూ క్షీణింప సాగింది.

*   *   *   *   *

ఆ దినము రాత్రి చాల ప్రొద్దుపోయేవరకూ చంద్రమౌళి సహాధ్యాయులతో తిరిగి తిరిగి యింటికి చేరుకున్నాడు. వేడి పానీయము త్రాగి పక్కమీద వాలబోతూ మరునాటికి ఏమైనా షుఖ్య విషయాలు డైరీలో వ్రాసి ఉన్నవేమోనని బల్లమీది డైరీ తెరచాడు

మరునాడు మహాశివరాత్రి-ఆ దినమే అతడి పుట్టిన దినము !

ఇరవై ఆరు సంవత్సరాల క్రిందట అతడి అమ్మమ్మ శివరాత్రినాడు ఉప వాసము ఉండి - మహేశ్వరారాధనకొరకు శివాలయములోకి వెళ్ళి - రుద్రాభిషేకము చేయించి ఇంటికి వచ్చేసరికి పుట్టాడని 'చంద్రమౌళి' అని పేరు పెట్టింది. మాతా మహుల యింట తల్లీ - పితామహుల యింట తండ్రీ తప్ప మరొకసంతు లేక పోవటమువల్ల రెండు కుటుంబాలకూ చంద్రమౌళి మాట శిరోధార్యముగానే ఉండేది చేతులకు మురుగులు నడుముకు గజ్జెలు మెడలో పచ్చల పులిగోరు పెట్టు కొని - దిగంబరుడై - బాలకృష్ణుని చేష్టలను మరపించే బాల్యక్రీడలతో రెండు కుటుంబాలలోని ముసలివాళ్ళనూ పరుపులెత్తిస్తూ ఉండేవాడు. పన్నెండు పదమూడు సంవత్సరాలు వచ్చేవరకూ వాళ్ళే కలిపి అన్నము చంద్రమౌళి నోటికి అందిస్తూ ఉండేవారు. ఆ రెండు కుటుంబాలకూ దేవుళ్ళతోపాటు చంద్రమౌళి కూడా ఆరా

ధించవలసిన వాడైనాడు. అటు అమ్మమ్మకు ఇటు నాయనమ్మకు చంద్రమౌళి ఒక్క నాడు కనబడక పోతే తెల్లవారటము కష్టముగా ఉండేది.

తాతలిద్దరూ పోయిన తరువాత ఆ ముసలమ్మలిద్దరూ చంద్రమౌళి కోసము ఆస్తిని రొక్కము క్రింద మార్చుకొని - నగకట్టును చేతపట్టుకొని చంద్రమౌళి తండ్రి దగ్గరనే ఉండి పోయారు.

ఇంతమందికి గారాబుపట్టి కనుక ఇరవై ఏళ్ళయినా రాకముందే దేశమంతా గాలించారు - చంద్రమౌళికి తగిన వధువు కొరకు. ఎక్కడ పిల్ల ఉన్నదని తెలిసినా ముసలమ్మలిద్దరూ ముందుగా వెళ్ళి చూసి వచ్చేవారు. చాలా సంబంధాలు చంద్రమౌళి వరకూ వచ్చేవేకావు. తిరిగి తిరిగి - వాళ్లే పసందుచేసి తెచ్చారు ఒక సంబంధాన్ని. ఆ వధువే గిరిజ. కొండలలో అవతరించి మహేశ్వరునికై ఇటు నటు తిరుగాడు హిమపుత్రికలా వాళ్ళదృష్టికి గిరిజ కనబడ్డది. ఆ బాలికను చూసి వచ్చిన వృద్ధులు అనేకముగా వర్ణించి-చంద్రమౌళిచేత మెప్పించి-తాళి కట్టించారు. ఆనాడు వాళ్ళిద్దరూ తమ నగలమూట విప్పి వంతులు వేసుకొని గిరిజను అలంకరించారు.

* * * * *

గిరిజ సంభాషణలో చమత్కారమూ వ్యంగ్యమూ పొదిగించి మాట్లాడేది. ఆమె మాటలలోని భావము మరునాటికిగాని చంద్రమౌళికి అర్థమయ్యేదికాదు. ముసలమ్మలు అవ్యక్తానందంలో ఊదులాడేవారు.

ఒకరోజు సాయంత్రము చంద్రమౌళి కచేరినుండి వచ్చి ముసలమ్మల గదిలోకి వెళ్ళి ఆనాడు తనకు కచేరిలో వేసిన పూలహారము చూపించి 'వాసన బాగున్నదా?' అంటూ బల్లమీద పెట్టాడు.

'మంచి దొంతర మల్లెల హారము వేశారు. అయితే మనము ఇక్కడ నుంచి బయలుదేరట మెప్పుడూ' అన్నది అమ్మమ్మ.

'వారము రోజులలో బయలుదేరాలి. ఈలోపల సామానులన్నీ సర్ది ఉంచండి'- అని అతడు వెనుకకు తినుగుతూ ఉండగా హంసనడకలతో గిరిజ ఆ

గదిలోకి వచ్చింది. పూలహారాన్ని ఒకసారి వాసన చూసి ఆమె చేతిలో పెట్టాడు చంద్రమౌళి.

దాని నందుకుంటూ 'నేనొకమాట అంటాను. మీకు కోపము రాదుకదా! మీ స్నేహితుడు మీకెంత ఆప్తుడైతే మాత్రము నా మంచముమీద పడుకునేటంత చనవూ అలుసూ యివ్వటము మీకు భావ్యమేనా?' నదురూ బెదురూ లేకుండా అడిగింది గిరిజ.

ముసలమ్మలిద్దరూ నిర్విణ్ణులయి పోయారు! చంద్రమౌళి ఆలోచనలో పడ్డాడు. ఎవరూ ఆ స్నేహితుడు? తన స్నేహితులెవరూ తన యింటిలోపటికి-పడకగది వరకూ వచ్చేవాళ్ళులేరే! అతడికి ఉన్నదే ఒక్క స్నేహితుడు రామలింగము.... అతడే ఎప్పుడైనా వస్తుంటాడు. గాని లోపలికి ఎన్నడూరాడే! "నీ గదిలో అడుగు పెట్టగలిగిన వాడెవడబ్బా" అంటూ ముఖము చిట్లించాడు చంద్రమౌళి.

"నా మాట నిజమో అబద్ధమో వచ్చి చూడండి" అని తన గది వైపుకు చంద్రమౌళిని తీసుకొని వెళ్ళింది.

గిరిజ గది మేడమీద కుడివైపుగా ఉన్నది. ముసలమ్మ లిద్దరూ నోరు తెరకుకొని మెట్లదగ్గరే నిలువబడి పోయారు.

చంద్రమౌళి గిరిజతో మెట్లుఎక్కి- గది తలుపులు తోసుకుంటూ లోపలికి వెళ్ళుతున్నాడు. తనకు ఇంతద్రోహము తలపెట్టినవాడిని- ఏదయినా చేసి కసితీర్చుకోవాలని పళ్ళు కొరుకుతూ లోపలికి వెళ్ళాడు. గిరిజ మాట్లాడకుండా గదిముందర నిలిచిపోయింది.

మంచము దగ్గరకి పళ్ళు కొరుకుతూ వెళ్ళిన చంద్రమౌళి పెద్దపెట్టున నవ్వుతూ "వీడేనా.... నీ మంచముమీద పడుకున్న నా ఆప్తమిత్రుడు? హీరో! నిన్ను చూస్తే గిరిజకంత అసహ్యమెందుకు?" అంటూ ఎత్తుకొని దాని శరీరమంతా చేతితో నిమురుతూ గిరిజ దగ్గరికి తీసుకొనివచ్చి 'ఎంతమంచిదో చూడు. యీ హీరో!' అన్నాడు. ఆమె మాట్లాడకపోవడము గమనించి 'దీనిని చూడకపోతే నా ప్రాణము నిలుస్తుందా?' అంటూ హీరోను ఎత్తుకొని కిందికి తీసుకొనివచ్చి ముసలమ్మలకు చూపించాడు.

గిరిజ మంచము మీద చనువుగా శయనించిన చంద్రమౌళి ఆప్తునిచూసి ముసలమ్మ లిద్దరూ ముక్కుమీద వేలు వేసుకొన్నారు.

అది చంద్రమౌళికి ప్రాణప్రదమైన మేలుజాతి కుక్క. పై ఆఫీసరు గారి జాతికుక్క, పిల్లలను పెట్టినదని ఏడాదికిందట- తెచ్చి-ఎంతో మక్కువతో దానిని సాకుతున్నాడు. దానిపేరు హీరో. అతడు తప్ప ఆయింట మరెవరూ దానినితాకరు. కుక్కపిల్ల అంటే ముసలిమ్మ లిద్దరికి అచారమూ-గిరిజకు అసహ్యమూను.

"ఇంకా ఎన్నాళ్లు ఈ కుక్క సిల్లతో ఆడుకుంటారు?" అనేవాళ్లు ఆ వృద్ధులు. 'చంద్రమౌళి తండ్రి ఎప్పుడవుతాడా' అని నిరీక్షించి నిరీక్షించి దైవ సాయుజ్యము పొందారు ముసలమ్మలు.

వాళ్ళ ఒడిలో తాను పెరగటమూ-తనను వాళ్ళు ప్రాణాధిక్యముగా చూచుకోనటమూ జ్ఞాపకము వచ్చింది చంద్రమౌళికి. బాల్యజీవిత మెంత ఆనందకరమైనది? తలక్రిందులుగా తపముచేసినా నిన్నటిరోజు తిరిగి రాదుకదా! ఈ జగన్నాటక రంగములో నిష్క్రమించిన పాత్ర తిరిగి ప్రవేశించరుకదా! ఆ ముసలమ్మ లిద్దరిలో అమ్మమ్మను చూస్తే అతడికి మరీ ప్రాణము. ఆమె నిరుడే-చంద్రమౌళి ఒడిలో శివసాయుజ్యము నొందింది.

తన పుట్టినరోజున వాళ్లిద్దరూ ఎంత హడావడి చేసేవారు! తన తలిదండ్రుల ప్రేమ-వాళ్ళ ఆపేక్ష చాటునబడి అణగిపోయేది. ఇంతకాలమూ వాళ్ళచేత ఎంతో ఆడంబరముగాను- వైభవముగాను జరుపబడిన అతడి జన్మదినము ఈసారి ఎవరి గమనికా లేకుండా జరిగిపోతున్నది. అతడు భోగజగత్తులో విహరించి పట్టిల కొట్టి నిద్రలో మునిగిపోయాడు.

* * * *

విమానముమీద చంద్రమౌళి అమెరికానుండి బొంబాయి చేరి వారమురోజు లక్కడే గడిపాడు. తరువాత మదరాసుచేరి తన స్నేహితుడిన కలుసుకొన్నాడు.

ఉదయము లేచిన దగ్గరనుండీ మదరాసు బజారులన్నీ తిరిగితిరిగి- రాత్రి రెండవఆట సినిమాచూసి పడుకోటానికి మాత్రము ఇంటికి వస్తున్న చంద్రమౌళిని పది దినములు గమనించిన స్నేహితుడు, "డ్యూటీలో చేరటానికి ఇంకా పైము

ఉన్నవా ఏమిరా?” అన్నాడు. ఆపడి దినములల ఆతవి దినచర్యచూస్తే స్నేహితుడికి ఆశ్చర్యము వేసింది. తనకొడకు కలవరించిపోతున్న తలిదండ్రులను చూడాలని చంద్రమౌళి తహతహ లాడడు. తనకొరకు ఎదురు తెన్నులు చూస్తూ నిరీక్షిస్తున్న భార్యను స్మరించడు. విదేశీవాసనలు బాగా తలకెక్కినవేమో తాను గమనించకుండా ఉంటేనే బాగుంటుం దనుకున్నాడు స్నేహితుడు.

* * * * *

నిండుపున్నమినాటి పండువెన్నెలలో లక్ష్మయ్యగారూ ఆయన భార్య, గిరిజ రాత్రి చాలా పొద్దుపోయేవరకూ అరుబైట కూర్చుని మాట్లాడుతున్నారు.

‘రెండునెలల క్రిందటే అబ్బాయి అక్కడినుంచి బయలుదేరుతాడని ఎవరో అన్నారు కాదుటే?’ అన్నారు లక్ష్మయ్యగారు.

‘వాడి దగ్గరనుంచి ఉత్తరమ్ముక్క కూడా జరువై పోయింది’ అన్నది తల్లి గద్గదస్వరముతో.

గిరిజ కండ్లనుండి కన్నీరు కాలువలై ప్రవహించింది. ‘అందుకేనమ్మా, మేము వాడి మాటయినా ఎత్తకుండా అంతా కడుపులోనే పెట్టుకుంటున్నాము.’ అని అత్తగారు గిరిజను చేరదీసుకొన్నది.

అంతలో వాకిటితలుపు చప్పుడుఅయింది. బెదరిన చెంత్రుకలతో తూలిపోతూ లోపలికి వస్తున్న వ్యక్తినిచూపి అదదిపడి లేచారు.

‘ఇంతరాత్రివేళ రైలెక్కడిదిరా చంద్రమౌళీ?’ అన్నాడు తండ్రి.

“నేను ఉదయమే వచ్చాను” అని పంచంమీద కూర్చున్నాడు చంద్రమౌళి.

“మీ ఆరోగ్యము ఎట్లా ఉన్నాది? మిమ్మల్ని చూద్దామని వచ్చాను. రేపు ఉదయపు రైలులో వెళ్ళిపోవాలి”.

“అదేమిటి? రావడమెప్పుడు-వెళ్ళటమెప్పుడు? మరి ఉదయము వచ్చినవాడవు యింటికిరాక ఏంచేస్తున్నావు? కాళ్ళు కడుక్కో. భోజనము చేద్దువుగాని!” తల్లి లేచి వంటయింట్లోకి దారితీసింది.

"వద్దమ్మా వద్దు. నా భోజనమయి చాలా సేపయినది. గ్లాసెడు మంచినీళ్లు ఇస్తే చాలు" అంటూ కోటు విడిచి చేతిమీద వేసుకున్నాడు.

అడిగిన ప్రశ్నలకు కురచ జవాబు లివ్వటమువల్ల "నాయనా! నిద్రవస్తున్నది కాబోలు. తెల్లవారిన తరువాత మాట్లాడుదాము" అని లక్ష్మయ్యగారు లేచారు.

చంద్రమౌళి ఇంట్లో కాలుపెట్టిన దగ్గరనుండీ అతడి వైపు చూచి నిర్విణ్ణురాలై గోడకు బల్లివలె అంటుకొని పోయినది గిరిజ.

ముందుగా తల్లిలేచి హాలులో దీపముపెట్టి గది తలుపులు తెరుస్తూ ఉండగా చంద్రమౌళి ఆమె వెనుకనేవెళ్ళి 'నాకు నిద్రరావటము లేదమ్మా! ఆరు బైటఉన్న మంచముమీద కూర్చుంటాను' అంటూ యిల్లు నాలుగు మూలలా దృష్టిని పోనిచ్చాడు. 'ఆ యిల్లు తన యిల్లే.... కాని పరాయిదై పోయినది!' అనుకొని ముక్కు ముడుచుకొనిపోగా తల్లివెంట నడిచాడు. తల్లి గదిలోకి వెళ్ళి దీపము పెద్దదిచేసి వీడిన చూశావురా నాయనా!' అంటూ వుండగా లక్ష్మయ్యగారు కూడా ఆ గదిలోకి వచ్చారు.

ఒక మనిషికి బాల్యములోనూ - యౌవనములోనూ వార్ధక్యములోనూ తీసిన ఛాయాచిత్రములా ఉన్న ఆ ముగ్గురి ముఖాలనూ తల్లి ఆనందముతో పరికించింది.

బాలుడి ముఖము తండ్రి ముఖము తేరిపారచూసిన చంద్రమౌళి "వీడుటే నీవు అంతగా వర్ణించి వ్రాసిన పైమనిషి?" అంటూ చేతిమీది కోటు తలుపుమీద వేసి. వంచిన గిరిజతలను రెండుచేతులతో పైకెత్తాడు చంద్రమౌళి.